సాక్షి మెదక్

ఆదివారం । 23 । జూలై । 2023



వరదొస్తే..రాకపోకలు బంద్

భారీ వర్షాలు కురిసిన ప్రతిసారీ రాకపోకలు స్తంభించడం పరిపాటిగా మారింది. వరద ఉధృతి తగ్గే వరకు భారీ వాహనాలు రోజుల తరబడి నిలిపేయాల్సిన దుస్థితి నెలకొంది.

8లో



అక్రమ నిర్మాణాలకు నోటీసులు

అల్లాదుర్గంలో అనుమతి లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారికి నోటీసులు జారీ చేసినట్లు పంచాయతీ కార్యదర్శి సవిత అన్నారు.

9లో

ఎస్సీ అభ్యర్థులకు శిక్షణ

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో న్యాయ శాస్త్ర పట్టభద్రులైన ఎస్సీ యువతీ యువకులు స్టైఫండ్‌తో కూడిన మూడేళ్ల ఉచిత శిక్షణ ఇప్పిస్తున్నామని జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి విజయలక్ష్మి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో మొత్తం 8 సీట్లు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఆగస్టు 5 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

న్యూస్‌రీల్

నిధులు మంజూరు చేయాలి



సీఎంను కలిసిన ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

నర్సాపూర్: నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనుల కోసం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాలని సీఎంను నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి కోరారు. శనివారం ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ప్రగతి భవన్‌లో కలిశారు.

రూ. 1.63 లక్షల పనులకు అవకతవకలు



ప్రజాదర్బార్ నిర్వహిస్తున్న అధికారులు

మనోహరాబాద్(తూప్రాన్): రూ.1.63 లక్షల పనులకు అవకతవకలను గుర్తించామని, 15 రోజుల్లో పూర్తి చేయాలని డీఆర్డీఓ అధికారులు సూచించారు. మండల పరిషత్‌లో ఎంపీపీ పురం నవనీతరవి ఆధ్వర్యంలో అడిషనల్ డీఆర్డీఓ విరోజ , వివిధ శాఖల అధికారులు ఎన్ఆర్ఈజీఎస్ పనులపై ప్రజాదర్బార్ శనివారం చేపట్టారు. మండలంలో రూ. 9 కోట్ల ఉపాధి హామీ పనులు చేపట్టినట్లు తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో రూ. లక్షా 63 వేల పనులకు అవకతవకలు జరిగినట్లు గుర్తించామన్నారు. ఆ పనులను పదిహేను రోజులలో పూర్తి చేయాలన్నారు. రూ 6వేల జరిమానా పడినట్లు వివరించారు.

శేరిపల్లిలో ఒకరికి డెంగీ



శేరిపల్లిలో స్ప్రే చేస్తున్న సిబ్బంది

వర్గల్(గజ్వేల్): వర్గల్ మండలం శేరిపల్లిలో ఒక వ్యక్తి 'డెంగీ' బారిన పడ్డాడు. లక్ష్మక్కపల్లి ఆర్వీఎం ఆసుపత్రి వైద్యులు నిర్వహించిన వైద్యపరీక్షల్లో అతను డెంగికి గురైనట్లు నిర్ధరించారు. ఈ మేరకు వర్గల్ వైద్యాధికారిణి హరితకు అక్కడి నుంచి సమాచారం రావడంతో యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. శనివారం శేరిపల్లి గ్రామంలో బాధితుని ఇంటి వద్ద, ఇరుగుపొరుగు ఇళ్ల వద్ద, పరిసరాల్లో స్ప్రేయింగ్ చేయించారు. పారిశుధ్య పనులు చేపట్టారు. బాధితుడు ఆర్వీఎం ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నట్లు డాక్టర్ హరిత పేర్కొన్నారు.

అధిక ధరలకు అమ్మితే చర్యలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): నిత్యావసర సరుకులను ఎమ్మార్పీ రేట్ల కంటే అధికంగా విక్రయిస్తే లైసెన్సులు రద్దు చేస్తామని జిల్లా తూనికల, కొలతల అధికారి శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం మండల కేంద్రమైన జగదేవ్‌పూర్‌లో కిరాణా, సూపర్‌మార్కెట్లు, రైస్ డిపోల్లో ఆకస్మిక తనిఖీ చేపట్టారు. బియ్యం, సరుకులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలం చెల్లిన సరుకులను విక్రయించరాదన్నారు. తూకంలో తేడా వచ్చిన షాపు నిర్వాహకులకు జరిమానా వేసినట్లు తెలిపారు.

కర్ణాటకకు 'నారింజ' జలాలు



ప్రాజెక్టు నుంచి దిగువకు చేరుతున్న వరద నీరు

జహీరాబాద్: నాలుగు రోజులగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఎగువ ప్రాంతం నుంచి నారింజ ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. శనివారం ప్రాజెక్టులోకి 1,300 క్యూసెక్కుల నీరు వచ్చే అవకాశం ఉందని.. ఇంతే దిగువకు వదిలిపెడుతున్నట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. ప్రాజెక్టులోకి చేరిన నీరంతా దిగువన ఉన్న కర్ణాటకలోకి తరలివెళుతోందన్నారు. ప్రాజెక్టు సామర్థ్యం 0.85 క్యూసెక్కులు మాత్రమే ఉండగా, ఒక్క భారీ వర్షానికే ప్రాజెక్టులో సామర్థ్యం మేర నీరు చేరుతోంది. మిగిలిన నీరంతా కర్ణాటక పరం అవుతోంది. అదనపు జలాలు సద్వి నియోగం చేసుకునేందుకు ఎలాంటి ప్రణాళికా లేకపోవడంతో నీటిని వృథాగా వదులుకోక తప్పడంలేదు.

ఫీవర్ పంజా!

జిల్లాలో వ్యాధులు ప్రబలుతున్నాయి. వైరల్ ఫీవర్, డెంగీ కేసులు ఎక్కువ నమోదవుతున్నాయి. ఆస్పత్రులకు రోగుల తాకిడి పెరిగింది. వీటి నివారణ కోసం ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

- ప్రబలుతున్న వ్యాధులు
- వెంటాడుతున్న వైరల్ ఫీవర్
- జిల్లాలో ఇప్పటికే డెంగీ 10 కేసుల నమోదు
- కానరాని ముందస్తు చర్యలు

మెదక్‌జోన్: వర్షాకాలంలో వ్యాధుల నివారణ కోసం ముందస్తుగా చర్యలు చేపట్టాల్సిన అధికారులు కేవలం పత్రిక ప్రకటనలకే పరిమితం అవుతున్నారు తప్ప నివారణ చర్యలు చేపట్టడం లేదని ప్రజలు విమర్శలున్నాయి. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా 10 డెంగీ కేసులు నమోదయ్యాయి. అందులో మెదక్‌లో 3, నర్సాపూర్‌లో 3, కొడిపల్లి 1, చిన్నశంకరంపేట1, తిమ్మాయిపల్లి 1, పాపన్నపేట 1 మొత్తం 10 కేసులు నమోదయ్యాయి. మెదక్‌లో జంబికుంటకు చెందిన ఒకే ఇంట్లో 2 కేసులు నమోదయ్యాయి. డెంగీ వచ్చిందని తెలియగానే వైద్యాధికారులు హడావిడి చేసి బాధితుడి ఇంటి చుట్టూ, వీధిలో రక్తనమూనాలు సేకరించి స్ప్రేలు కొట్టి వెళ్లారు తప్ప ముందస్తు చర్యలపై దృష్టి సారించలేదని విమర్శలున్నాయి. గతేడాది 43 డెంగ్యూ కేసులతోపాటు 2 మలేరియా కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం ఇప్పటి వరకు మలేరియా కేసులు నమోదు కాలేదు. ఇక వైరల్ ఫీవర్ కేసుల విషయమై నిత్యం పదుల సంఖ్యలో ప్రజలు ఆస్పత్రుల్లో చేరుతున్నారు. ప్రతి శుక్రవారమూ నిర్వహించాల్సిన డ్రైడే ఫ్రైడే సైతం ఎక్కడా చేపట్టిన దాఖలాలు లేవు.

కొనసాగుతున్న కార్మికుల సమ్మె

అసలే జిల్లాలో డెంగీతోపాటు వైరల్ ఫీవర్ విజృంభిస్తున్న నేపథ్యంలో 15 రోజులుగా పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మెతో అనేక గ్రామాలు చెత్తాచెదారంతో నిండుతున్నాయి. కొన్ని మండలాల్లో పారిశుధ్య పనులు చేసుకుంటూ సమ్మె చేస్తుండగా, మరికొన్నింటిలో పనులు బహిష్కరించి చేపడుతున్నారు. దీంతో ఆయా గ్రామాల్లో చెత్త అధికమై వ్యాధులు ప్రబలే పరిస్థితి ఉందని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వైద్యారోగ్య శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇవి చేస్తే బాగుండు

దోమకాటుతో డెంగీ, మలేరియా, చికెన్ గున్యా, బోదకాలు, మెదడువాపు, వచ్చే ప్రమాదం ఉంటుంది. ఈ వ్యాధులు రాకుండా గ్రామాల్లోని నిలిచిన నీటి గుంతల్లో ఆయిల్ బాల్స్ వేయటం, లేదంటే దోమలను తినే గంబూసియా అఫ్పినిస్ చేపలను వాటిలో వేసిగుంతలు పూడ్చాలి. మురుగు కాలువలు శుభ్రంగా ఉంచటం, బ్లీచింగ్ పౌడర్ చల్లటం, ఫాగింగ్ లాంటివి చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదని పలువురు పేర్కొంటున్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత పడాలి. వారానికోసారి డ్రమ్ముల్లోని నీటిని పారబోయటం, నీటి ట్యాంకులు, డ్రమ్ములు, మంచినీటి ట్యాంకులపై మూతలు పెట్టాలి. కొబ్బరి చిప్పలు, టైర్లలో నీరు లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రజలు తీసుకోవాల్సి ఉంది. ప్రతి ఏటా వర్షాకాలం సీజన్‌లో జనాభా ప్రాతిపదికన ఆయా గ్రామాలకు నిధులు విడుదలయ్యేవి. ఈసారి సైతం నిధులు విడుదలైనట్లు జిల్లా వైద్యాధికారి చెబుతుండగా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు మాత్రం ప్రత్యేకంగా నిధులేమీ విడుదల కాలేదని పేర్కొంటున్నారు.



మెదక్‌లో డెంగీ బాధితుడి ఇంటిలో స్ప్రే చేస్తున్న దృశ్యం

దోమల నివారణకు చర్యలు



జిల్లాలో దోమల నివారణ కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రారంభించాం. గ్రామాల్లోని మురుగు గుంతల్లో దోమ ఉధృతికి కారణమయ్యే లార్వా నివారణకు ఆయిల్ బాల్స్ వేయటం, గంబూసియా అఫ్పినిస్ చేపలను వేయటం, మందులు స్ప్రే చేయాలని ఆదేశించాం.

దాక్టర్ చందూనాయక్ , జిల్లా వైద్యాధికారి

కాంగ్రెస్, బీజేపీకి డిపాజిట్లు దక్కవు

ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి. ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

రామాయంపేట(మెదక్): రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ వెంటిలేటర్‌పై కొనసాగుతున్నాయని, రెండు పార్టీలకు డిపాజిట్లు కూడా వచ్చే పరిస్థితి లేదని ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో పదికిపది స్థానాలు బీఆర్ఎస్ కైవసం చేసుకుంటుందని జోస్యం చెప్పారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు సీఎం కేసీఆర్ వెంటే ఉన్నారన్నారు. భారీ వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రామాయంపేట మున్సిపాలిటీ అభివృద్ధి కోసం రూ. 20 కోట్లు మంజూరయ్యాయని, త్వరలో అభివృద్ధి పనులు ప్రారంభిస్తామని భరోసానిచ్చారు. వర్షాలకు ఇళ్లు కూలిపోయిన బాధితులకు గృహలక్ష్మి పథకం కింద గృహాలు మంజూరు చేస్తామని ధైర్యం చెప్పారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్, చిన్నశంకరంపేట జెడ్పీటీసీ రాజు, చేగుంట ఎంపీపీ మాసుల శ్రీనివాస్, చేగుంట సర్పంచ్ మంచుకట్ల శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

మంత్రులకు కృతజ్ఞతలు

మెదక్ మున్సిపాలిటీ: మెదక్, రామాయంపేట మున్సిపాలిటీలకు చేరో రూ.20కోట్లను మున్సిపల్ మంత్రులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానన్నారు. శనివారం మెదక్‌లోని క్యాంపు కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. టీయూఎఫ్ఐడీసీ నుంచి ఈ నిధులు మంజూరుకు కృషి చేసిన మంత్రి హరీశ్‌రావు, కేటీఆర్‌లకు ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో మెదక్ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, కౌన్సిలర్ జయరాజ్, మెదక్ ఆత్మ కమిటీ చైర్మన్ అంజాగౌడ్ ఉన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మ, ఎంపీ ప్రభాకర్‌రెడ్డి

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

ఎస్పీ రోహిణి ప్రియదర్శిని

కొడిపల్లి(నర్సాపూర్): నేరాల దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానం సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ రోహిణి ప్రియదర్శిని సూచించారు. గ్రామాలు, పట్టణాల్లో నేరాలు, చోరీల నియంత్రణకు పోలీసులు నిరంతరం గస్తీ నిర్వహిస్తూ ప్రజలక్షేమం కోసం పోలీసులు కృషి చేస్తున్నారన్నారు. శనివారం కొడిపల్లి స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, రికార్డులు పరిశీలించారు. పోలీస్ విధులు, నేరాల అదుపులో ఉంచేందుకు తీసుకుంటున్న చర్యలను ఎస్ఐ శివప్రసాద్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, జిల్లాలో ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం అమలు చేస్తున్నామన్నారు. స్టేషన్‌కొచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించి సమస్యలు పరిష్కరించేలా కృషి చేయాలని సూచించారు. నేరాల అదుపునకు నిరంతరం గస్తీ నిర్వహించాలన్నారు. సీసీ కెమెరాలతో నేరాల అదుపుతోపాటు నిందితులకు పట్టుకునేందుకు దోహదం చేస్తాయని చెప్పారు.



కొడిపల్లి స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎస్పీ రోహిణి

వారంలోగా సీఎంఆర్ ఇవ్వాలి

కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: వారంలోగా మిల్లింగ్ చేసి సీఎంఆర్(కస్టమ్స్ మిల్లింగ్ రైస్) అందజేయాలని కలెక్టర్ రాజర్షిషా రైస్‌మిల్లర్లను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో రైస్‌మిల్లర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2021–22, 2022–23 రబీ, ఖరీఫ్‌లకు సంబంధించిన పెండింగ్ రైస్ మిల్లింగ్ చేసి సీఎంఆర్ పెట్టాలన్నారు. జిల్లా నుంచి ఎఫ్‌సీఐకి బియ్యం సరఫరాలో ఎక్కువగా రిజెక్షన్ చేస్తున్నారని, వాటిని రిజెక్షన్ చేయటం తగ్గిస్తూ మిల్లర్లకు సహాయం చేయాలని డీఎంకు సూచించారు. ఈ సందర్భంగా మిల్లర్ల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఎఫ్‌సీఐ పెండింగ్ బియ్యాన్ని వెంటనే పూర్తి చేయాలని మిల్లర్లకు ఆదేశాలిచ్చారు. ఖరీఫ్ బియ్యం డెలివరీకి జూలై 31 తుదిగడువన్నారు. ఆలోగా లక్ష్యం పూర్తి చేసే విధంగా మిల్లర్ల చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే ఖరీఫ్ 2022–23 ధాన్యాన్ని తమ కెపాసిటీ ప్రకారం ఎఫ్‌సీఐ గోదాంలకు తరలించాలని తెలిపారు. సమీక్షలో అదనపు కలెక్టర్ జి.వెంకటేశ్వర్లు , జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శ్రీనివాస్, జిల్లా అధికారులు , ఆర్‌డీఓలు, జిల్లా రైస్ మిల్లర్ల అధ్యక్షుడు చంద్రపాల్, ఇతర మిల్లర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

డయాలసిస్ కేంద్రాన్ని మార్చండి

మెదక్‌జోన్: డయాలసిస్ కేంద్రాన్ని వసతులు గదిలోకి మార్చాలని కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. శనివారం ప్రభుత్వాస్పత్రిలోని డయాలసిస్ కేంద్రాన్ని పరిశీలించారు. ఆ గది ఉరుస్తుండటంతో ఏ మాత్రమూ నిర్లక్ష్యం చేయకుండా వెంటనే మరొకగదికి మార్చాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ప్రభుత్వాస్పత్రిలో డయాలసిస్ బాధితులకు అందుతున్న వైద్యం గురించి కలెక్టర్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. డయాలసిస్ కేంద్రంలో ఎంతమంది వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉన్నారు? వారి సమయాలు తదితర వివరాలపై అక్కడే ఉన్న సిబ్బందితో స్వయంగా మాట్లాడారు. కలెక్టర్‌తోపాటు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పీసీ శేఖర్ తదితరులున్నారు.

మా సహకారం తీసుకోండి

జిల్లా వ్యవసాయాధికారిణి ఆశాకుమారి

మెదక్ కలెక్టరేట్ : జిల్లాలో నాలుగైదు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అన్నదాతలు పంటలకు అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారిణి ఆశాకుమారి సూచించారు. ఈ విషయంలో జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆయా మండలాల్లోని మండల వ్యవసాయాధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారుల సహకారం తీసుకోవాలన్నారు. శనివారం ఆమె తన కార్యాలయంలో మాట్లాడుతూ, జిల్లావ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నందున వర్షాధార పంటలైన పత్తి, కంది, మొక్క జొన్న , జొన్న, వరి పంటలను సాగు చేస్తున్న రైతులు తమ పొలాల్లో నీరు అధికంగా నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలన్నారు. అలాంటి పరిస్థితులుంటే వెంటనే నీటిని బయటకు పంపించేలా అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.

విద్యారంగ సమస్యలపై పోరుబాట

చేగుంట(తూప్రాన్): విద్యారంగ సమస్యల సాధన కోసం తపస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు 19వ తేదీ వరకు ఉద్యమ జాగరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తపస్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాతు సురేశ్ అన్నారు. చేగుంట తపస్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, నెల రోజులపాటు విద్యారంగ ఉపాధ్యాయ సమస్యపై పోరాటం చేస్తున్నామన్నారు. సంతాకల సేకరణ, ప్రభుత్వ కార్యదర్శికి ఈమెయిల్ ద్వారా సమస్యల వినతి, తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయాల వద్ద నిరసన, ఆగస్టు 19న ఇందిరా పార్కు వద్ద ధర్నా ఉంటుందన్నారు.



మాట్లాడుతున్న తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేశ్

బయోప్రొడక్ట్ క్యారీ బ్యాగులే వాడాలి

మున్సిపల్ చైర్మన్ టి.చంద్రపాల్

మెదక్ మున్సిపాలిటీ: ప్రజలు ప్లాస్టిక్ బదులు మట్టిలో కలిసిపోయే బయోప్రొడక్ట్ క్యారీ బ్యాగులు వాడాలని మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ సూచించారు. శనివారం ఏబీసీఎంటీ బయోప్రొడక్ట్స్, పట్టణంలోని ప్రత్యేక వాణిజ్య వ్యాపార సముదాయ యజమానులతో మున్సిపల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్లాస్టిక్ బదులుగా మొక్కజొన్న, గంజి తదితరాల బయోప్రొడక్ట్స్‌తో మట్టిలో కలిసిపోయే క్యారీ బ్యాగులు వినియోగించాలని సూచించారు. ప్లాస్టిక్ వాడితే భారీ జరిమానా విధించి, ట్రేడ్ లైసెన్స్‌లు రద్దు చేసి, షాపులు మూసివేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరెళ్ల మల్లికార్జున్‌గౌడ్, కౌన్సిలర్ అవారి శేఖర్ , మునిసిపల్ కమిషనర్ ఎస్.వి. జానకిరామ్ సాగర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేష్, మెప్మా టీఎంసీ సునీత, వ్యాపారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ చంద్రపాల్

142 మంది విద్యార్థులకు కండ్లకలత

వర్గల్ నవోదయ, ములుగు గురుకులాలను సందర్శించిన డీఎంహెచ్ఓ

వర్గల్/ములుగు(గజ్వేల్): వర్గల్ జవహర్ నవదోయ, ములుగు సోషల్‌వెల్ఫేర్ గురుకుల విద్యాలయాల్లోని 142మంది విద్యార్థులకు కండ్లకలత సోకింది. శుక్రవారం నుంచి ఈ వ్యాధి సోకి ఇబ్బంది పడుతున్నారనే సమాచారంతో కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ వెంటనే స్పందించారు. ఆయన ఆదేశాలతో శనివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కాశీనాథ్ నేతృత్వంలో వైద్యబృందం సభ్యులు పాఠశాలలను సందర్శించారు. ప్రత్యేకంగా మెడికల్ క్యాంపులు నిర్వహించి నేత్ర వైద్య నిపుణులతో విద్యార్థులందరికీ వైద్య పరీక్ష నిర్వహించారు. వర్గల్ నవోదయలో 82 మంది, ములుగు సోషల్ వెల్ఫేర్ గురుకులంలో 60 మంది విద్యార్థులు కండ్లకలతతో బాధపడుతున్నారని నిర్ధారణ అయింది. వీరికి ఐడ్రాప్స్, టాబ్లెట్లు పంపిణీ చేశారు. వీరిని ప్రత్యేక గదులలో ఉంచి అవసరమైన వైద్య సేవలందిస్తున్నారు. రెండు విద్యాసంస్థలలో ఒక్కొక్క స్టాఫ్ నర్స్, అవసరమైన మందులు అందుబాటులో ఉంచారు.

ఆందోళన చెందొద్దు

కండ్లకలత సోకిన విద్యార్థుల విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ కాశీనాథ్ అన్నారు. వారి ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని, అవసరమైన అన్ని జాగ్రత్తలూ తీసుకున్నట్లు వివరించారు. నవోదయ ప్రిన్సిపాల్ రాజేందర్‌కు పలు సూచనలు చేశారు. వైద్యబృందంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీనివాస్, నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ రాకేష్, వర్గల్ వైద్యాధికారి డాక్టర్ హరిత, సిబ్బంది ఉన్నారు.

కరువుతీరా వాన

- రాష్ట్రంలోనే ఉమ్మడి జిల్లాలో అత్యధిక వర్షపాతం నమోదు
- నిండుకుండలా జలాశయాలు

ఉమ్మడి మెదక్ జిల్లాలో కరువుతీరా వాన కురిసింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రాష్ట్రంలోనే అత్యధిక వర్షపాతం నమోదైన నాలుగు జిల్లాల్లో సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట ఉన్నాయి. సాధారణం కంటే సగటున సుమారు 75 శాతం అధిక వర్షపాతం నమోదైంది. సమీపంలో ఉన్న వికారాబాద్ జిల్లాలోనూ ఇదే పరిస్థితి. వానాకాలం సీజన్ ప్రారంభమైన నెల రోజులు అంతంత మాత్రంగానే కురిసిన వర్షాలు.. వారం రోజులుగా దంచికొడుతున్నాయి. దీంతో పంటలకు ఉపశమనం కలగడమే కాకుండా.. జలాశయాలు నిండుకుండలా కనిపిస్తున్నాయి.

– సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి



జూన్ 1 నుంచి జూలై 22 వరకు నమోదైన వర్షపాతం

జిల్లా	సాధారణం (సె.మీ)	కురిసింది (సె.మీ)	వ్యత్యాసం
సంగారెడ్డి	25.9	42.76	70 శాతం అధికం
మెదక్	26.52	48.20	82 శాతం అధికం
సిద్దిపేట	23.09	40.32	75 శాతం అధికం

నైరుతి రుతుపవనాల ప్రభావంతో జూన్ నుంచి సెప్టెంబర్ వరకు వర్షాలు కురుస్తుంటాయి. అయితే జూలై మొదటి వారం వరకు ఉమ్మడి జిల్లాలో సాధారణ వర్షపాతం కంటే తక్కువ రికార్డు అయింది. సంగారెడ్డి జిల్లాను తీసుకుంటే జూన్ నెలాఖరు వరకు 120.1 మి.మీల సగటు వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, కేవలం 104 మి.మీలు మాత్రమే నమోదైంది. అంటే సాధారణం కంటే సుమారు 13 శాతం తక్కువ వర్షపాతం రికార్డు అయింది. అయితే గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో సాధారణం నుంచి అత్యధిక వర్షపాతం నమోదు కావడం గమనార్హం. సాధారణంగా కురవాల్సిన వర్షం కంటే 20 శాతం నుంచి 59 శాతం తక్కువ వర్షపాతం నమోదైతే లోటు వర్షపాతంగా వాతావరణ శాఖ భావిస్తుంది. అలాగే కురవాల్సిన వర్షం కంటే 19 శాతం తక్కువ కురిసిన, 19 శాతం ఎక్కువ కురిసినప్పటికీ సాధారణ వర్షపాతంగానే లెక్కిస్తారు. 20 నుంచి 59 శాతం వరకు ఎక్కువ వర్షపాతం నమోదైతే అధిక వర్షపాతంగా లెక్కిస్తారు. 60 శాతానికి మించి ఉంటే అత్యధిక వర్షపాతంగా పరిగణిస్తారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో ఉమ్మడి జిల్లాతో పాటు, వికారాబాద్‌లో కూడా అత్యధిక వర్షపాతం నమోదైంది.

క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పట్టణంలోని అశోక్‌నగర్‌ సమీపంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రామచంద్రాపురం పట్టణంలోని అశోక్‌నగర్‌ సమీపంలోని జాతీయరహదారి పక్కన ఖాళీగా ఉన్న సిమెంట్‌ పైపులో ఓగుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందజేశారు. దీంతో పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని వయస్సు 35ఏళ్లు ఉండొచ్చని పోలీసులు పేర్కొన్నారు. మృతుడు కొంత కాలంగా ఆ ప్రాంతంలో భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నాడని స్థానికులు పోలీసులకు చెప్పారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కూరగాయల మార్కెట్‌లో టమాటాలు చోరీ

జహీరాబాద్‌: జహీరాబాద్‌ పట్టణంలోని కూరగాయల మార్కెట్లో శనివారం తెల్లవారుజామున టమాటాలు చోరీ అయ్యాయి. జగన్నాథ్‌రెడ్డి కమీషన్‌ ఏజెంట్‌ వద్దకు ఓ రైతు శుక్రవారం రాత్రి టమాటాలను ట్రేలో విక్రయం నిమిత్తం తరలించాడు. తరలించిన బాక్సులను ఉదయం చూసే సరికి వాటిలో నుంచి మూడు బాక్సులు అపహరించినట్లు బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. చోరీకి గురైన టమాటా విలువ రూ.6,500 మేర ఉంటుందని పేర్కొన్నారు. ఓ వ్యక్తి తలకు హెల్మెట్‌తో పాటు రేయిన్‌ కోట్‌ ధరించి మోటారు సైకిల్‌పై వచ్చి చోరీకి పాల్పడ్డట్టు సీసీ కెమెరాలో గుర్తించారు. ఒక్కో టమాటా బాక్సును మోటారు సైకిల్‌పై పెట్టుకుని దొంగతనానికి పాల్పడ్డాడు. ఇలా మూడు సార్లు వచ్చి తీసుకెళ్లినట్లు సీసీ పుటేజీల్లో రికార్డయ్యింది.

రేణుక ఎల్లమ్మ ఆలయంలో..

జహీరాబాద్‌ టౌన్‌: మొగుడంపల్లి మండల కేంద్రంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. గుర్తుతెలియని దొంగలు ఆలయ ప్రధాన గేటు పగులగొట్టి ఉండి ఎత్తుకెళ్లారు. ఇద్దరు యువకులు ఆలయంలోకి చొరబడిన దృశ్యాలు సీసీ కెమెరాలో నిక్షిప్తమయ్యాయి. విష యం తెలుసుకున్న గ్రామస్తులు చిరాగ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ నరేశ్‌ కేసు దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

వరద ఉధృతి పరిశీలన

న్యాల్‌కల్‌(జహీరాబాద్‌): మండల పరిధిలోని రేజింతల్‌ శివారులోని మామిడ్గి వాగు వరద ఉధృతిని శనివారం అధికారులు పరిశీలించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో మామిడ్గి వాగు పొంగి ప్రవహిస్తోంది.

వరదొస్తే.. రాకపోకలు బంద్‌



వరద నీటిలో వెళ్తున్న వాహనలు

- ఉధృతంగా ప్రవహిస్తున్న మోయతుమ్మెద వాగు
- లోలెవల్‌ వంతెనతో ఇబ్బందులు
- పోరెడ్డిపల్లి మీదుగా సిద్దిపేట–హన్మకొండ వాహనాల మళ్లింపు

కోహెడరూరల్‌(హుస్నాబాద్‌): భారీ వర్షాలు కురిసిన ప్రతీసారి వాగులు వంకలు పొంగడం, రాకపోకలు స్తంభించడం పరిపాటిగా మారింది. అవసరమైన చోట వంతెనలు లేకపోవడంతో వాహనదారులు, గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సార్లు వరద ప్రవాహంలో కొట్టుకొని పోయి పలువురు మృతి చెందుతున్నారు. కోహెడ మండలం బస్వాపూర్‌ గ్రామంలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు మోయతుమ్మెద వాగు పొంగిపొర్లడంతో సిద్దిపేట–హన్మకొండ రహదరి రాకపోకలు నిలిచిపోయాయి. వరద ఉధృతి తగ్గే వరకు భారీ వాహనాలు రోజుల తరబడి నిలిపేయాల్సిన దుస్థితి నెలకొంది.

ప్రమాదకరంగా వంతెన

మోయతుమ్మెద వాగుపై వంతెన ప్రమాదకరంగా తయారైంది. ఈ వంతెన దశాబ్దాల క్రితం అప్పటి వరదను తట్టుకునేవిధంగా నిర్మించారు. ప్రస్తుతం దీనిపైనుంచి వరదనీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వర్షాకాలంలో పలువురు వంతెన దాటే క్రమంలో వరద నీటిలో కొట్టుకుపోయి మృత్యువాతపడిన సంఘటనలు ఉన్నాయి. ఈ వంతెన ఇప్పుడు శిథిలావస్థకు చేరుకుంది. వంతెనకు ఇరువైపుల రెయిలింగ్‌ లేకపోవడంతో రక్షణ లేకుండా పోయింది. రాత్రి వేళల్లో వంతెనపై అంధకారంగా ఉండంటంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి.

రాకపోకలకు అంతరాయం...

బస్వాపూర్‌ గ్రామంలో మోయతుమ్మెద వాగు తక్కువ ఎత్తులో ఉండటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. ఎగువ నుంచి వచ్చే వరద ఉధృతికి రోజుల తరబడి రాకపోకలు నిలిపేయాల్సి వస్తుంది. ప్రతీ యేటా ఈ సమస్య తలేత్తుతుంది. వంతెనపై అంతరాయం ఏర్పడటంతో పోరెడ్డిపల్లి మీదుగా సిద్దిపేట–హన్మకొండకు వెళ్లే వాహనాలను మళ్లిస్తున్నారు.

ఎన్నిసార్లు వినతులు చేసినా పట్టించుకోవడం లేదు



బస్వాపూర్‌లో వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు ఉన్నా నిర్మాణానికి పూనుకోవడం లేదు. సిద్దిపేట నుంచి ఎల్కతుర్తికి జాతీయ రహదారి నిర్మాణం జరుగుతుంది. ఈ రహదారిలోనే బస్వాపూర్‌ మోయతుమ్మెద వాగుపై నిర్మించే వంతెన ఉండటంతో నిర్మాణంలో ఆలస్యం అవుతుంది. ప్రతీ వానాకాలంలో ఇదే పరిస్థితి మోయతుమ్మెద వాగుపై హైలెవల్‌ వంతెన లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. వంతెన సమస్యపై ఎన్నిసార్లు వినతులు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. వానాకాలంలో లోలెవల్‌ వంతెనపై నుంచి వరద ఉధృతంగా పారడంతో రోజుల తరబడి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. ప్రతీ వానాకాలం ఇదే పరిస్థితి.

– తాటిపాముల రాజేశ్‌గౌడ్‌, వాహనదారుడు, బస్వాపూర్‌

వానొస్తే రాకపోకలకు అంతరాయం



మోయతుమ్మెదవాగుపై దశాబ్దాల క్రితం వంతెన నిర్మించారు. ప్రస్తుత వరద ప్రభావానికి గురై వంతెన మునిగిపోతుంది. వరద నీటిలో పలువురు కొట్టుకుపోయారు, గల్లంతయ్యారు. ఇప్పటికైనా వరద ముప్పు తప్పించి రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలి.

–ఎండీ ముజాహిద్‌ పాషా, బస్వాపూర్‌

దూసుకొచ్చిన మృత్యువు

- బురదమడిలో మూర్ఛతో పడి తమ్ముడు విలవిల
- రక్షించేందుకు సోదరుడి యత్నం.. వారిపై దూసుకొచ్చిన ట్రాక్టర్‌
- తమ్ముడు మృతి, అన్నకు తీవ్ర గాయాలు అన్నకు తీవ్రగాయాలు



రమేశ్‌ (ఫైల్‌)

శివ్వంపేట (మెదక్‌): వరినాట్ల పనుల్లో నిమగ్నమైన అన్నదమ్ములపై దమ్ముయంత్రం (కెజివీల్స్‌ ట్రాక్టర్‌) మృత్యురూపంలో దూసుకొచ్చింది. దీంతో తమ్ముడు మృతి చెందగా.. అన్న తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన మెదక్‌ జిల్లా శివ్వంపేటలో శనివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఎనగండ్ల నరేశ్‌, తమ్ముడు ఎనగండ్ల రమేశ్‌(35) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శనివారం వరినాట్లు వేసేందుకు దుక్కి సిద్ధం చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. రమేశ్‌ వొరం చదును చేస్తున్న సమయంలో మూర్ఛ వ్యాధితో బురదమడిలో పడికొట్టుకుంటున్నాడు. అక్కడే దమ్ము యంత్రం నడుపుతున్న నరేశ్‌ గమనించి తమ్ముడిని రక్షించేందుకు ట్రాక్టర్‌ను ఆఫ్‌ చేయకుండానే కిందికి దూకి పరుగెత్తుకుంటూ వచ్చాడు. దీంతో ట్రాక్టర్‌ ఒక్కసారిగా రమేశ్‌ తలపై, నరేశ్‌ కాళ్లపై నుంచి వెళ్లడంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. అక్కడే ఉన్న కూలీలు ఇద్దరిని తూప్రాన్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా రమేశ్‌ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. నరేశ్‌ను మెరుగైన చికిత్స నిమిత్తం కొంపల్లిలోని ప్రైవేట్‌ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

పాలిటెక్నిక్‌ కళాశాలలో స్పాట్‌ అడ్మిషన్లు

జహీరాబాద్‌ టౌన్‌: పాలిటెక్నిక్‌ డిప్లొమా కోర్సులకు ఈ నెల 28 స్పాట్‌ అడ్మిషన్లు జరుగుతాయని రంజోల్‌ శ్రీసంగమేశ్వర్‌ ప్రభుత్వ పాలిటెక్నిక్‌ ప్రిన్సిపాల్‌ కుమారస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. చివరిదశలో మిగిలిపోయిన సీట్లను స్పాట్‌లో హాజరైన విద్యార్థులకు ర్యాంకుల ప్రకారం కేటాయిస్తామని పేర్కొన్నారు. ఈ నెల 25 తేదీ ఉదయం 11 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పాలిసెట్‌ హాల్‌టిక్కెట్‌, ర్యాంక్‌ కార్డు, ఎస్‌ఎస్‌సీ మెమో, టీసీ, కులం, నివాస ధ్రువపత్రాలు, ఆధార్‌ కార్డు జిరాక్స్‌ కాపీలను జతచేయాలన్నారు. ఈ నెల 28 ఉదయం 10 గంటలకు మెరిట్‌ లిస్టును పెట్టి స్పాట్‌ అడ్మిషన్‌లు చేపడుతామని ప్రిన్సిపాల్‌ పేర్కొన్నారు.

సీఐగా పదోన్నతి



విజయకృష్ణ



ఏడుకొండలు

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న విజయకృష్ణ సీఐగా పదోన్నతి పొందారు. రెండున్నరేళ్లుగా గుమ్మడిదల ఎస్‌ఐగా విజయకృష్ణ విధులు నిర్వహించాడు. అనేక కేసులను ఛేదించి, ప్రజలకు సమస్యలు లేకుండా చేశారు.

సీఐగా ఏడుకొండలుకు పదోన్నతి

నారాయణఖేడ్‌: నారాయణఖేడ్‌ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న ఏడుకొండలుకు సీఐగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఏడుకొండలు రాయికోడ్‌ నుంచి నారాయణఖేడ్‌ ఎస్‌ఐగా బదిలీపై వచ్చి విధులు నిర్వర్తిస్తున్నారు. ఖేడ్‌ ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించిన నెలలోనే సీఐగా పదోన్నతి లభించింది.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి అదృశ్యం

దుబ్బాకలో రైతు కల్లు తాగొస్తానని ఇంట్లో చెప్పి వెళ్లిన వ్యక్తి తిరిగి రాలేదు. రామచంద్రాపురం పట్టణంలోని సాయినగర్‌ కాలనీలో నివాసం ఉండే విజయ్‌కుమార్‌ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. డ్యూటీకని వెళ్లి నేటికి తిరిగి రాలేదు. సంగారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ మెడికల్‌ కాలేజీలో కూలి పనికి వచ్చిన జార్ఖండ్‌ వాసి అదృశ్యమయ్యాడు.



బండి రాజయ్య (ఫైల్‌)

దుబ్బాక: దుబ్బాక పట్టణంలో రైతు అదృశ్యమయ్యాడు. దుబ్బాక స్టేషన్‌ హౌస్‌ ఆఫీసర్‌ బత్తుల మహేందర్‌ తెలిపిన వివరాల ప్రకారం..దుబ్బాక పట్టణానికి చెందిన బండి రాజయ్య వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల రాజయ్యకు నోటి క్యాన్సర్‌ రావడంతో వారం రోజుల క్రితం డాక్టర్లు ఆపరేషన్‌ చేశారు. గత బుధవారం రాత్రి కల్లు తాగి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. అర్ధరాత్రైన రాజయ్య ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టు పక్కల వెతికినా అతని అచూకీ లభ్యం కాలేదు. శనివారం రాజయ్య పెద్ద కొడుకు సాయికృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్టేషన్‌ హౌస్‌ ఆఫీసర్‌ బత్తుల మహేందర్‌ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9652593246 నంబర్‌ను సంప్రదించాలని కుటుంబ సభ్యులు కోరారు.

రామచంద్రాపురంలో..



విజయ్‌కుమార్‌ (ఫైల్‌)

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన రామచంద్రాపురం పట్టణంలోని సాయినగర్‌లో శనివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. రామచంద్రాపురం పట్టణంలోని సాయినగర్‌ కాలనీలో నివాసం ఉండే విజయ్‌ కుమార్‌ (59) సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో మే 19వ తేదీ సాయంత్రం 6గంటల సమయంలో ఇంటి నుంచి డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి బయటకు వెళ్లాడు. మరుసటి రోజు విజయకుమార్‌ తన బంధువుతో ఫోన్‌లో మాట్లాడాడు. కాని రెండు నెలలు గడుస్తున్నా విజయ్‌కుమార్‌ ఇంటికి రాకపోవంతో అతని కుటుంబ సభ్యులు ఆందోళన చెంది బంధువులు, స్నేహితుల ఇళ్లలో అతని ఆచూకీ కోసం ఆరా తీశారు. అతని ఆచూకీ లభించకపోవడంతో అతని కుటుంబ సభ్యులు శనివారం పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సంగారెడ్డి మున్సిపాలిటీలో..

సంగారెడ్డి మున్సిపాలిటీ: జార్ఖండ్‌ రాష్ట్రంలోని గుతుహాతు గ్రామానికి చెందిన బల్దేర్‌ పహన్‌ (39) ఈ నెల 15న రాత్రి 11 గంటలకు తన గ్రామం నుంచి సంగారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ మెడికల్‌ కాలేజీలో కూలి పనికి వచ్చాడు. అదే రాత్రి భోజనం చేసి పడుకున్నాడు. రాత్రి 2.30 గంటల ప్రాంతంలో కాలకృత్యాలకు బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ తెలిసినవారు పట్టణ పోలీస్‌ స్టేషన్‌ 08455–276333 లేదా 8712656718 ఫోన్‌ నంబర్లకు సమాచారం అందించాలని సీఐ శ్రీధర్‌ రెడ్డి సూచించారు.

ప్లంబర్‌ పనికని వచ్చి..

- 32తులాల బంగారం, 30తులాల వెండి
- రూ.1.50లక్షలు అపహరణ



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ చంద్రమోహన్‌ యాదవ్‌

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లిలో ఓ ఇంట్లో పనికని వచ్చి 32తులాల బంగారం, 30తులాల వెండి, రూ.1.50లక్షలు చోరీ చేసిన ఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..కొమురవెల్లి గ్రామానికి చెందిన అంబడిపల్లి నాగరాజు తన ఇల్లు గ్రౌండ్‌ ఫ్లోర్‌ను కొద్దిరోజులుగా మరమ్మతులు చేయిస్తున్నాడు. ఇంటిపైభాగంలోని రూంలో విలువైన సామాన్లు పెట్టి తాళం వేశారు. ఇంట్లో ప్లంబర్‌ పని చేస్తున్న గ్రామానికి చెందిన మేడికుంట మల్లేశం ఉదయం ఇంటికి వచ్చి తనపని పూర్తయిందని చెప్పాడు. తన సామాన్లు తీసుకెళ్తానని కుటుంబ సభ్యులకు తెలిపాడు. ఈ క్రమంలో చాయిపోయమని నాగరాజు భార్య అర్చనను అడిగాడు.

ఆమె ఇంట్లోకి వెళ్లి చాయి తీసుకొచ్చి ఇచ్చింది. అది తాగి మల్లేశం బయటకు వెళుతుండగా తన ఇంట్లోని కవర్‌ ఎక్కడికి తీసుకపోతున్నావు అని అడగగా తన సామాన్లు పెట్టుకున్నట్లు చెప్పుకొచ్చాడు. అతను వెళ్లిపోయిన అనంతరం 15 నిమిషాల తర్వాత అర్చన బంగ్లాపైన గల బీరువాలో చీరలు తీసుకునేందుకు వెళ్లగా పైగది తాళం పగులగొట్టి అందులోనుంచి 32తులాల బంగారం, 30తులాల వెండి, రూ.1.50లక్షలు చోరీకి గురైనట్లు గుర్తించింది. ఈ విషయాన్ని కుటుంబసభ్యులకు తెలిపింది. తమ ఇంట్లోకి ఎవరూ రాలేదని గ్రహించి వచ్చిన ప్లంబరే తీసి ఉంటాడని అనుమానం వ్యక్తం చేసింది. వెంటనే ప్లంబర్‌ మల్లేశంకు ఫోన్‌ చేసి ఎక్కడ ఉన్నావని అడిగింది.

అతను ఇంటి వద్దే ఉన్నట్లు తెలిపాడు. వెంటనే ఆమె తన ఇంటికి రమ్మని కోరగా వస్తానని చెప్పి ఫోన్‌ స్విచ్‌ ఆఫ్‌ చేసి పారిపోయినట్లు తెలిపారు. వెంటనే నాగరాజు స్థానిక పోలీస్‌ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ చంద్రమోహన్‌ యాదవ్‌ సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టి మల్లేశం కోసం గాలిస్తున్నారన్నారు.

ఇద్దరి ప్రాణాలు బలిగొన్న క్షణికావేశం

భార్య గొంతుకోసి.. ఆపై ఆత్మహత్య

సంగారెడ్డి టౌన్‌: క్షణికావేశం ఇద్దరి ప్రాణాలను బలిగొంది. ఓ భర్త కట్టుకున్న భార్య గొంతుకోసి.. ఆపై ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన సంగారెడ్డి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణ పరిధిలోని పోతిరెడ్డిపల్లి వీకర్‌ సెక్షన్‌ కాలనీలో నివాసం ఉంటున్న అల్లం యాదగిరి(36), యశోద(30) దంపతులు. యాదగిరి ప్లంబర్‌ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. 15 రోజులుగా భార్యాభర్తలు గొడవ పడుతున్నారు. భార్య యశోద తన ముగ్గురు పిల్లల్ని తీసుకొని పుట్టింటికి వెళ్లింది. శుక్రవారం రాత్రి పిల్లలను అక్కడే వదిలేసి సంగారెడ్డి చేరుకుంది. రాత్రి వరకు బాగానే ఉన్నా దంపతులు శనివారం ఉదయం మళ్లీ గొడవ పడ్డారు. క్షణికావేశంలో భర్త.. భార్య గొంతు కోసి హత్య చేశాడు. ఆపై తాను ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సంఘటన స్థలానికి డీఎస్పీ రమేశ్‌, సీఐ సుధీర్‌ కుమార్‌, ఎస్‌ఐ రాజేశ్‌ చేరుకొని వివరాలు సేకరించారు.

వీడియోకాల్‌ చేసి.. ఉరేసుకొని..

డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య



శివకుమార్‌ (ఫైల్‌)

పటాన్‌చెరు టౌన్‌: ఓ డిగ్రీ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ దుర్గయ్య కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండలం రామేశ్వరంబండ గ్రామ పరిధిలోని వీకర్‌ సెక్షన్‌ కాలనీకి చెందిన శ్రీరాములు కుమారుడు శివ కుమార్‌(20) పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో శివకుమార్‌ డ్రెస్‌ కుట్టించుకొని వస్తానని చెప్పి వెళ్లాడు. వెళ్లిన కొద్దిసేపటికి సోదరి సోనికి వీడియో కాల్‌ చేసి తను ఉరి వేసుకుని చనిపోతున్నట్లు తెలిపాడు. దీంతో ఆందోళనకు గురైన ఆమె.. విషయాన్ని వెంటనే కుటుంబ సభ్యులకు చెప్పింది. వారు వెంటనే ఇందిరమ్మ ఇల్లు బ్లాక్‌ నంబర్‌ 6లోకి వెళ్లగా అప్పటికే రేకుల షెడ్‌కి చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. చికిత్స నిమిత్తం అతణ్ని స్థానికంగా ఓ ప్రైవేట్‌ ఆసుపత్రికి తీసుకెళ్లగా.. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తన కుమారుడు ఏ కారణంతో చనిపోయాడనే విషయం తెలియదని, మృతుడు తండ్రి శ్రీరాములు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు.

డివైడర్‌ దాటి.. ఆపై కంటైనర్‌ ఢీకొని..



తార్యానాయక్‌ (ఫైల్‌)



అంకిత్‌ (ఫైల్‌)



మృతదేహాలు

- రోడ్డు ప్రమాదంలో బీఆర్‌ఎస్‌ నేత, తనయుడి మృతి

రామాయంపేట: దైవదర్శనానికి వెళుతుండగా బీఆర్‌ఎస్‌ నేత, అతని కుమారుడు దుర్మరణం చెందారు. వీరు ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని అవతలి వైపునకు దూసుకెళ్లగా..ఎదురుగా వచ్చిన కంటైనర్‌ ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటన మెదక్‌జిల్లా నార్సింగి మండలం వల్లూరు జాతీయ రహదారిపై శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నార్సింగి మండల బీఆర్‌ఎస్‌ నేత, సహకార సంఘం మాజీ అధ్యక్షుడు తార్యానాయక్‌(42), ఆయన కుమారుడు అంకిత్‌ (10) కారులో కర్నాల్‌పల్లి ఎల్లమ్మగుడికి దర్శనం నిమిత్తం వెళుతున్నారు. వారు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి అవతలి వైపునకు దూసుకెళ్లింది. దీంతో ఎదురుగా వస్తున్న కంటైనర్‌ లారీ.. వీరి వాహనాన్ని ఢీకొని కొంత దూరం ఈడ్చుకెళ్లింది. కారులోనే ఇరుక్కుపోయిన తండ్రీ, కొడుకులు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు రెండు గంటలపాటు శ్రమించి మృతదేహాలను వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఇద్దరు రైతుల మృతి

కోహీర్‌లో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై రైతు మృతి చెందాడు. చిలప్‌చెడ్‌లో గుండె పోటుతో మరో రైతు మృతి చెందాడు.

కోహీర్‌(జహీరాబాద్‌): ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై రైతు మృతి చెందాడు. ఎస్‌ఐ సురేశ్‌ తెలిపిన వివరాల ప్రకారం..పెద్దదొడ్డి పాండురంగారెడ్డి(68) పంట పాడైపోకుండా ఉండేందుకు వర్షపు నీటిని బయటకి పంపించి వస్తానని చెప్పి శుక్రవారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో పొలానికి వెళ్లాడు. రాత్రయినా తిరిగి రాకపోవడంతో కుమారుడు రమేశ్‌రెడ్డి పొలానికి వెళ్లి చూడగా బోరు వద్ద తండ్రి మృతి చెంది ఉన్నాడు. వెంటనే గ్రామంలోకి వెళ్లి రైతులను తోడు తీసుకొని వచ్చి చూడగా బోరు పంపునకు అమర్చిన సపోర్టు వైరు ద్వారా విద్యుత్‌ సరఫరా జరిగి ప్రమాదవశాత్తు పాండు రంగారెడ్డి మృతి చెందినట్లు వారు గుర్తించారు. కుమారుడు రమేశ్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపాడు.

చిలప్‌చెడ్‌లో గుండెపోటుతో..



దశరథ్‌ (ఫైల్‌)



పాండురంగారెడ్డి (ఫైల్‌)

చిలప్‌చెడ్‌(నర్సాపూర్‌): పొలం పనులు ముగించుకొని ఇంటికి వెళ్లిన ఓ రైతు గుండెపోటుతో మృతి చెందిన ఘటన మండల కేంద్రమైన చిలప్‌చెడ్‌లో శనివారం జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..చిలప్‌చెడ్‌ గ్రామానికి చెందిన గొట్టం దశరథ్‌(52) పొలం వద్దకు వెళ్లి పనులు ముగించుకొని ఇంటికి వచ్చాడు. ఇంటికొచ్చిన కొద్ది సేపటికే దశరథ్‌ గుండెపోటుతో కుప్పకూలాడు. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలిస్తుండగానే మృతి చెందాడు. దశరథ్‌ గోపాలమిత్రగా విధులు నిర్వహిస్తున్నాడు.

ప్రమాదవశాత్తు బావిలో పడిన నక్క

- రక్షించిన చేర్యాల అటవీ అధికారులు



ఫారెస్టు అధికారులతో మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ స్వరూపరాణి, వైస్‌ చైర్మన్‌ నిమ్మ రాజీవ్‌రెడ్డి

చేర్యాల(సిద్దిపేట): ప్రమాదవశాత్తు బావిలో పడిన నక్కను అటవీ అధికారులు రక్షించారు. స్థానికులు, జిల్లా ఫారెస్టు అధికారి శ్రీనివాస్‌ తెలిపిన వివరాల ప్రకారం..పట్టణ శివారు రొల్లబండ కాలనీ సమీపంలో రామగల్ల నాగరాజుకు చెందిన వ్యవసాయ బావిలో నక్క పడిపోయింది. దీన్ని గమనించిన రైతు చేర్యాల ఫారెస్టు బీట్‌ అధికారి రాముడు, మున్సిపల్‌ చైర్‌ పర్సన్‌ అంకుగారి స్వరూపరాణి, వైస్‌ చైర్మన్‌ నిమ్మ రాజీవ్‌రెడ్డికి చేరవేశారు. అక్కడికి చేరుకున్న జిల్లా ఫారెస్టు అధికారి, బీట్‌ అధికారులు, పరిసర రైతులు, వలల సహాయంతో నక్కను బయటకు తీశారు. అనంతరం నక్కను సమీపంలోని అటవీ ప్రాంతంలో వదిలేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఎక్కడైనా వన్యప్రాణులకు ఎలాంటి ప్రమాదాలు సంభవించినా వెంటనే తమ దృష్టికి తీసుకొస్తే రెస్క్యూటీం సహాయంతో వాటినిరక్షించి అడవిలో వదిలేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు రామగల్ల నరేశ్‌, రామగల్ల నాగరాజులను వారు అభినందించారు. ఈ రెస్క్యూ ఆపరేషన్‌లో జిల్లా ఫారెస్టు అధికారులతో పాటు వైస్‌ చైర్మన్‌ రాజీవ్‌రెడ్డి, మున్సిపల్‌ సిబ్బంది పాల్గొన్నారు.



వలకు చిక్కిన భారీ చేప

గజ్వేల్‌: భారీ వర్షాల నేపథ్యంలో గజ్వేల్‌ పట్టణంలోని పాండవుల చెరువు మత్తడి దుంకుతుండగా చేపల వేట మొదలైంది. తాజాగా శనివారం చేపల వేటకు వెళ్లిన వలస కార్మికులకు సుమారు 15కిలోల బరువుతో బొచ్చె చేప చిక్కింది. దీంతో వారు ఆనందంలో మునిగి తేలారు.